# జీవనోపాదులను ఎంచుకోవాలి

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**
పెండ్లిమర్రి మండలంలో 2026-27 వార్షిక రుణ మరియు జీవనోపాదుల ప్రణాళికపైన వీఓ ఓబీలకు, వీఓఏలకు మరియు ఈ నారి సీఆర్‌పీలకు యాక్షన్ ప్లాన్‌ను, వీఓ, ఎస్‌హెచ్‌జీ సభ్యులు స్థాయి వరకకు ఎలా తతీసుకోవాలి, ఏఏ జీవనోపాదులను ఎంచుకోవాలి తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, డీపీఎం నాగరాజు, ఏపీఎం వెంకట సుబ్బమ్మ, శివప్రసాద్, సీసీలు లక్ష్మీదేవి, గంగిరెడ్డి, నాగభూషణం, రామ్, నాగయ్య, గోపాల్ పాల్గొన్నారు.




వైఎస్ఆర్

# కడప వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

శనివారం 18 ఏప్రిల్ 2026




# కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఎంపీటీసీ నవీన్..

**యర్రగుంట్ల ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**
చిలంకూరు ఐసిఎల్ సిమెంట్ పరిశ్రమ యజమాన్యం స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ నవీన్ కుమార్ శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకురికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని ఉపాధి, విద్య, వైద్యం తదితర అంశాలను సిఎస్ఆర్ నిధులతో ఐసిఎల్ యజమాన్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



# ఇంటర్‌తోనే క్యాంపస్ ఉద్యోగాలు

**శ్రీ సాయి చైతన్య జూనియర్ కాలేజీలో తొలి క్యాంపస్ సెలక్షన్స్**

**హెచ్‌సిఎల్ ద్వారా 22 మంది విద్యార్థులకు అవకాశం**



ఆన్లైన్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**పులివెందుల ఏప్రిల్ 17, ప్రభాతవార్త :**
పులివెందుల విద్యారంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టుతూ, పట్టణంలోని శ్రీ సాయి చైతన్య జూనియర్ కాలేజీలో మొట్టమొదటి సారిగా ఇంటర్మీడియట్ స్థాయిలోనే క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించారు. సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇది గొప్ప అవకాశంగా నిలిచింది. ఇంటర్మీడియట్‌లో 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించగా, మొత్తం 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రముఖ సాఫ్ట్వేర్ సంస్థ హెచ్‌సిఎల్ ద్వారా ఈ ఎంపిక ప్రక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఈ నారాయణరెడ్డి డైరెక్టర్లు నీరజా రెడ్డి ,పీవీ సుబ్బారెడ్డి లో మాట్లాడుతూ పులివెందులలో తొలిసారిగా ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించడం విశేషమని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాది పాటు ట్రైనింగ్ అందించడంతో పాటు, ఆ కాలంలోనే సంవత్సరానికి రూ. 2,64,000 ప్యాకేజీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, ఉద్యోగంతో పాటు ఉన్నత చదువులకు కూడా సంస్థల ద్వారా అవకాశాలు కల్పించబడతా యని తెలిపారు. వచ్చే సంవత్సరాల్లో మరిన్ని ప్రముఖ కంపెనీలను తీసుకురావడానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పులివెందుల విద్యార్థులకు నూతన దిశను చూపించిందని, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రైతులు జొన్న కొనుగోలు కేంద్రాన్ని

# వినియోగించుకోవాలి



**దువ్వూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**
రబి కాలంలో జొన్న సాగు చేసిన రైతులు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ నాగ సుధా అన్నారు. శుక్రవారం దువ్వూరు సచివాలయం2 వద్ద జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ కాలంలో సాగు చేసిన జొన్న పంట ఈ క్రాప్ లో నమోదైన రైతుల వద్ద ఉన్న జొన్నలను ప్రభుత్వం మద్దతు ధరతో క్వింటాలుకు 3699 రూపాయలతో కొనుగోలు చేస్తామన్నారు. ఈ విషయంలో రైతులు తమ రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్టర్ లో నమోదు చేసుకోవాలని అనంతరం ఫలానా తేదీలో జొన్నలు కొనుగోలు చేస్తామని తమ సెల్ ఫోన్ కు సందేశం వస్తుందన్నారు. అప్పుడు రైతుల వద్ద ఉన్న జొన్నలు తీసుకురావాలని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వీటిని కొనుగోలు చేస్తామన్నారు. తేమ శాతం, ఇతర వ్యర్థ పదార్థాలను తీసివేసి నిర్వాహకులు కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సంజీవరెడ్డి, మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ రఘురామిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది కాంతమ్మ, రామ్ చరణ్, మనోజ్ రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు

# సత్వరం పరిష్కరించండి

**ప్రజాదర్బార్‌లో జగన్మోహన్ రాజు**



ప్రజల సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**
ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అధికారులను కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ వేదిక ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ వినతులు స్వీకరించారు. అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదని ఫిర్యాదు చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు బాధితులకు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు,వెంటనే పరిష్కార దిశగా చర్యలు చేపట్టేందుకుకృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్ళుగా భావించి సమన్వయంతో పాలన సాగిస్తున్నామని తెలియజేశారు. అంతకుముందు భూ సమస్యలు, వీటితో పాటు పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, సామాజిక పెన్షన్లు,ఇండ్ల స్థలాలు, తాగునీటి ఇబ్బందులు తదితర అంశాలపై వినతులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్య నాయుడు,సొసైటీ చైర్మన్ ములగూరు సుబ్రహ్మణ్యం నాయుడు,ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్,మార్కెట్ వైస్ చైర్మన్ చంగల్ రాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జీవీ సుబ్బరాజు, మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీమ్,ఒంటిమిట్ట సీనియర్ నాయకులు ఎస్వి రమణ,మండల క్లస్టర్ ఇన్చార్జ్ దగ్గుబాటి వెంకటేశ్వర్లు నాయుడు, దాసరి కళాధర్, పలువురు పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జలధార - జల హారతికి సన్నద్ధత

**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న"స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" ( కార్యక్రమంలో భాగంగా, ఈ నెల 18న జరగనున్న "జలధార - జల హారతి" కార్యక్రమంపై బద్వేల్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశమై కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల కార్యక్రమ ఇతివృత్తం"జలధార - జల హారతి" కాగా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల నీటి సంరక్షణ మరియు భూగర్భ జలాల రీఛార్జ్ ప్రత్యేక డ్రైవ్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. సమావేశంలో ముఖ్యంగా నీటి వనరుల పరిరక్షణపై దృష్టి సారించాలని ఆదేశించారు. వార్డుల్లోని చెరువులు, కుంటలను శుభ్రపరచడం, కాలువల్లో పూడికతీత పనులను వేగవంతంగా చేపట్టడం ద్వారా వర్షపు నీటి నిల్వకు మార్గం సుగమం చేయాలని పేర్కొన్నారు. అలాగే భూగర్భ జలాల పెంపు కోసం ఇంకుడు గుంతల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పాఠశాలలు, పార్కులు, బస్టాండ్లు మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కూడా కమిషనర్ ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్ సాధించడం లక్ష్యంగా, బద్వేల్ మున్సిపాలిటీని 5స్టార్ రేటింగ్ దిశగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇక ప్రజలూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, నీటి సంరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. స్వయం సహాయక సంఘాలు, యువత, స్థానిక నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



# అగ్ని మాపక వారోత్సవాలు

**విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన**

**జడ్పీ హైస్కూల్‌లో డెమో కార్యక్రమం నిర్వహణ**



అగ్ని ప్రమాదాల పై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

**పులివెందుల, ఏప్రిల్ 17, ప్రభాత వార్త :**
అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా పులివెందుల పట్టణంలోని అహోబిలపురం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయు లకు అగ్ని ప్రమాదాల నివారణ, జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది గ్యాస్ అగ్ని ప్రమాదాలు, విద్యుత్ సంబంధిత అగ్ని ప్రమాదాలు, ఆయిల్ ఫైర్లు, పరిశ్రమలలో జరిగే అగ్ని ప్రమాదాలు, గ్రామీణ ప్రాంతాల్లో సంభవించే అగ్ని ప్రమాదాల గురించి స్పష్టంగా వివరించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా సురక్షితంగా బయటకు వచ్చే విధానాన్ని ప్రదర్శన రూపంలో చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు బి. శ్రీనివాస్ రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పి సునీల్ కుమార్ ఫైర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి లీడింగ్ ఫైర్ మాన్ డి శివకుమార్ డ్రైవర్ ఆపరేటర్ కె మురళి పి సుదర్శన్ రెడ్డి ఫైర్ మాన్ వి హేమంత్ రెడ్డి హోంగార్డ్ కె.వి.రమణాచారి హోంగార్డ్ బి పూర్ణచంద్రనాయక్ హోంగార్డ్ సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంపొందించడం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# ఎడారి కష్టాలకు విముక్తి..

**మానవత్వం చాటుకున్న ఎస్ఏటిఎస్**

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త**



సౌదీ ఎడారిలో చిక్కుకొని, యజమాని వేధింపులతో దిక్కుతోచని స్థితిలో ఉన్న కడప వాసి షేక్ మహబూబ్ బాషాను సౌదీ అరేబియా తెలుగు సమాఖ్య (ఎస్ఏటి ఎస్) సభ్యులు అక్కున చేర్చుకొని సురక్షితంగా స్వదేశానికి పంపించారు. కడప నగ రం బెల్లంమండి యానాది కాలనీకి చెందిన బాషా ఉపాధి కోసం కువైట్ వెళ్లగా అక్కడి స్పాన్సర్ నిబంధనలకు విరుద్ధంగా అతడిని సౌదీకి తరలించి ఒంటెల కాపరిగా నియమించి చిత్రహింసలకు గురిచేశారు. అనారోగ్యంతో ఉన్నా కనికరించని యజమాని, బాధితుడి వద్ద నుండి భారీగా నగదు వసూలు చేసి, చెల్లుబాటు కాని విమాన టికెట్ ఇచ్చి దమ్మాం విమానాశ్రయంలో వదిలివేయడంతో మూడు రోజుల పాటు ఆకలితో అలమటించిన బాషా దీనస్థితిపై మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా స్పందించారు. వారి ఆదేశాల మేరకు గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్.బిహెచ్, మహబూబ్ ఇలాహి సమన్వయంతో సౌదీ అరేబియా తెలుగు సమాఖ్య ప్రతినిధులు ప్రవీణ్ కోలేటి, ఎన్.వి. భాను కిషోర్ (వెంకట్) వెంటనే రంగంలోకి దిగారు. విమానాశ్రయంలో ఉన్న బాధితుడిని చేరదీసి వసతి, భోజన సౌకర్యాలు కల్పించడమే కాకుండా, రియాద్‌లోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడి ఇమిగ్రేషన్ పనులు పూర్తి చేశారు. సమాఖ్య సభ్యులు తమ సొంత నిధులు సుమారు రూ.75 వేల విమాన టికెట్ ఏర్పాటు చేసి, సురక్షితంగా కడపకు పంపారు. ఎస్ ఏ టి ఎస్ అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని ఇలియాస్ తెలిపారు. ప్రాణాపాయం నుండి తనను రక్షించి కుటుంబం వద్దకు చేర్చిన ఎస్ఏటిఎస్ సభ్యులు తనకు అండగా నిలిచారని బాధితుడు మహబూబ్ బాషా కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధి హామీ సిబ్బంది

# బాధ్యతాయుతంగా పని చేయాలి




**కలసపాడు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**
మండలంలోని స్థానిక ఎంపీడీవో సభా భవనం లో శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పై సామాజిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా డ్రామా పీడి ఆదిశేషారెడ్డి హాజరై మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా సక్రమంగా అమలు చేయాలన్నారు. కలసపాడు మండలంలో ఉపాధి సిబ్బంది చాలా నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధ్యతాయుతంగా పనిచేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందుగా ఎంపీడీవో మహబూబ్బి మాట్లాడుతూ 2025 26 సం సంబంధించి 6 కోట్ల 50 లక్షల ఉపాధి పనులు జరిగాయని అందులో సామాజిక తనిఖీలు 30 వేల రూపాయలు అక్రమ పనులు జరిగాయని వాటిని రికవరీ రూపంలో కట్టడం జరిగిందని తెలియజేశారు. సామాజిక తనిఖీలు ఒక్కొక్క పంచాయతీ గురించి ఎస్ఆర్పీలు వివరిస్తూ పలు ఆరోపణలను సభాముఖంగా వివరించారు. వాటిని ద్వామాపిడి ఆదిశేషారెడ్డి వాటి వివరాలు సేకరించి పెండింగ్లో ఉన్న పనులను స్థానిక ఎంపీడీవో ద్వారా త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సామాజిక తనిఖీ అనంతరం మండలంలోని ఉపాధి సిబ్బందిని బదిలీల ప్రక్రియ చేపట్టమని ఎంపీడీవో కు ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం పేదల పథకం కావున ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఉద్దేశం తోనే ఈ పథకం ఉందని ఖచ్చితంగా పనులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. అదేవిధంగా డ్రామా పీడి మాట్లాడుతూ మండలంలో జలధార పై దృష్టి పెట్టమని, చెరువు కట్టల బలవపేతము, చెక్కుడాముల రిపేరు, కుంటల పూడిక చితలు ,అలుగుల మరమ్మతులు తదితర పనులను మొదలుపెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీవో శివశంకర్ రెడ్డి, ఎస్ఆర్పి నాగార్జున, మండలంలోని ఉపాధి సిబ్బంది, కలసపాడు మండల తెదేపా నాయకులు బుసుకే శ్రవణ్ కుమార్ రెడ్డి, కల్లూరు దుగ్గిరెడ్డి, ప్రహల్లాద రెడ్డి రసూల్ తెల్లపాడు రోసి రెడ్డి, పుల్లారెడ్డి పల్లె మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, రామాపురం మాజీ సర్పంచ్ బోడెద్దుల బాల అంకిరెడ్డి, కలసపాడు రాంబాబు పాల్గొన్నారు.

# చురుగ్గా జనగణన ఎన్యుమరేషన్

**సెల్ఫ్ ఎన్యూమరేషన్ నమోదు చేసుకున్న జిల్లా కలెక్టర్**

**కడప, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**
భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో"సెన్సెస్ సెల్ఫ్ ఎన్యూమరేషన్" కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి స్వయంగా సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో తన వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. కడప నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని"సెల్ఫ్ ఎన్యూమరేషన్" ప్రక్రియలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడం ద్వారా సమగ్ర మరియు ఖచ్చితమైన జనగణన సాధ్యమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కడప నగరపాలక సంస్థ కమిషనర్ రాకేష్ చంద్రం జనగణన ఎన్యుమరేషన్ కు సంబంధించి ఆన్ లైన్ నమోదు ప్రక్రియను తెలియజేశారు.



# పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**సిబ్బందికి 6 నెలల నుంచి జీతాలు అందడం లేదు**

**సమస్యలు పరిష్కరించకపోతే నిరాహార దీక్షలు చేపడుతాం**

**కాంగ్రెస్ ఇంఛార్జీ మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి**

**వేంపల్లె: ఏప్రిల్ 17 ప్రభాతవార్త**
మేజర్ పంచాయతీ అయిన వేంపల్లె గ్రామ పంచాయతీలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇంచార్జీ మూలంరెడ్డి దృవకుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థానిక ఎంపిడిఓ కుళాయమ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా పారిశుధ్య, వివిధ సిబ్బందికి జీతాలు అందడం లేదని, దీంతో వేంపల్లె పంచాయతీ పరిధిలో ఎక్కడ వేసిన చెత్త అక్కడే పడి దుర్వాసన వెలువడుతుందని, అలాగే మురికి కాలువల్లో నీరుకు బదులు ప్లాస్టిక్ కవర్ల, బాటిళ్లు, చెత్తాచెదారం దాపురించి ఉందని మండిపడ్డారు. ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా తయారై ఉన్నందున విష జ్వరాలు ప్రభలుతున్నాయని, ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపిడిఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే పారిశుధ్య సిబ్బందికి జీతాలు చెల్లింపుతో పాటు పిఫ్ నిధులు కూడా చెల్లించేందుకు కృషి చేయాలని కోరామన్నారు. దీంతో ఎంపిడిఓ కుళాయమ్మ సానుకూలంగా స్పందించి వీటిపై హామీ ఇచ్చారన్నారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో పంచాయతీ కార్యలయం ముందు నిరాహార దీక్షలు చేపడుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి మండలాద్యక్షులు రామకృష్ణ, చక్రాయపేట మండలాధ్యక్షులు రామాంజనేయులు రెడ్డి, కిస్సాన్ సెల్ పులివెందుల నియోజకవర్గ అధ్యక్షులు బద్రీనాథ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డా.సుబ్రమణ్యం, నాయకులు వేమయ్య, రాఘవయ్య, పంచాయతీ ఈఓ నాగభూషణ్‌రెడ్డి, పంచాయతీ పారిశుద్ధ సిబ్బంది తధీతరులూ పాల్గొన్నారు.



# జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన సిమెంట్ ట్యాంకర్

**గోపవరం ఏప్రిల్ 17, ప్రభాతవార్త**
గోపవరం మండలంపరిధిలోని మడకలవారిపల్లె సమీపంలో జాతీయ రహదారి 67పై శుక్రవారం ఒక సిమెంట్ ట్యాంకర్ ప్రమాదానికి గురైంది. రహదారి పక్కన ఉన్న కల్వర్టు కుంగిపోవడంతో ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ఘటనలో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. డ్రైవర్ సహా ఇతరులకు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని సమాచారం. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.



# పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు జాగ్రత్తలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం






**బద్వేలు, ఏప్రిల్ 17 ,ప్రభాతవార్త**

వేసవిలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని ,అందుకు తగ్గట్టుగా జాగ్రత్తలు పాటిస్తే, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ అన్నారు. బద్వేల్ పట్టణం లోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో, శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల వంటశాలను, ఆహార పదార్థాలను బ్రహ్మాజీ పరిశీలించారు. శుభ్రతపై జాగ్రత్తలను పాటించాలని, వంటవారికి పలు సలహాలు, సూచనలను ఇవ్వడం జరిగింది. వేసవిలో మంచినీరు ఎక్కువ తీసుకోవాలన్నారు. ఉదయం 10 గంటలలోగా బయట పనులు ముగించుకొని, తిరిగి సాయంత్రం ఐదు గంటల తర్వాత బయట పనులు చూసుకోవాలన్నారు. ఓ ఆర్ ఎస్ లను సిబ్బంది కి అందుబాటులో ఉంచమన్నారు .లార్వా, ఫీవర్, ఇంటింటి సర్వే నిర్వహించి ,లార్వాను నీటిని పూర్తిగా పడవేస్తున్నామన్నారు. ఈనెల 25వ తేదీ మలేరియా రోజు అని, విద్యార్థులకు మలేరియా పై పరీక్షలు నిర్వహించమన్నారు. 25వ తేదీన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. దోమల నివారణకు, దోమతెరలే శ్రేయస్కరమని, దోమ పుట్టకూడదు, కుట్టకూడదు అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి..

**యర్రగుంట్ల ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వస్తేనే పాఠాలు బోధించేవారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు మారాయి. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వ ఉపాధ్యాయుల పంథా కూడా మారింది. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి అంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు. యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురు భాస్కర్ రెడ్డి శుక్రవారం యర్రగుంట్ల మండల పరిధిలోగల గ్రామీణ ప్రాంతాల నందు ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.



## ఫోర్జరీ పత్రాలతో ఆస్తి మోసం - ఇద్దరు అరెస్ట్



**బద్వేల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

పట్టణంలోని టౌన్‌షిప్‌లోని ప్లాట్‌కు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి మోసానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను బద్వేల్ అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అర్బన్ ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు కలసపాడు మండలం శంకవరం గ్రామానికి చెందిన, బొగ్గవరపు ఓబులేషు, పగిడి బాలరాజు అనే ఇద్దరూ విదేశాల్లో ఉన్న యజమాని చెరుకూరి శ్రీహరి కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యంతో శ్రీహరి అక్కను మోసం చేసి ప్లాట్ కు సంబంధించిన పత్రాలను దొంగిలించారు. ఆ పత్రాలతో 2017 నాటి సేల్ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. అలాగే ఆస్తిని అక్రమంగా విక్రయించి రూ.12 లక్షలు పొందినట్లు గుర్తించారు. శుక్రవారం ఉదయం అబ్బుషాహెబ్‌పేట క్రాస్ రోడ్ వద్ద వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

## నాసిరకంగా ఎన్‌హెచ్ 67 రహదారి పనులు

**బద్వేలు అర్బన్ ,ఏప్రిల్ 17 ,ప్రభాతవార్త**



బద్వేల్-నెల్లూరు ఎన్‌హెచ్67 జాతీయ రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య కడప జిల్లా అధ్యక్షుడు పెద్దుల్లపల్లి ప్రభాకర్ ఆరోపించారు. రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలనే తొందరలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అనేక ప్రాంతాల్లో రోడ్లు కృంగిపోవడం, కల్వర్టులు దెబ్బతినడం, రోడ్డు పగుళ్లు ఏర్పడడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. శుక్రవారం మడకలవారిపల్లి సమీపంలో సిమెంట్ లారీ సైడ్‌కు దిగడంతో కల్వర్టు కృంగిపోవడంతో వాహనం బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. అలాగే మైదుకూరు మండలం తువపల్లె ఫ్లైఓవర్ వద్ద కూడా రోడ్డు పగుళ్లు ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలిగినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు సూచిక బోర్డులు సరిగా ఏర్పాటు చేయకపోవడం, కల్వర్టుల నిర్మాణాన్ని పూర్తిగా చేయకపోవడం వంటి నిరక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. మరోవైపు బ్రహ్మంగారుమఠం మండలం రేకలకుంట పంచాయతీలో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికీ పూర్తి పరిహారం అందలేదని ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత రెవెన్యూ మరియు జాతీయ రహదారి అధికారులు చర్యలు తీసుకొని, నాసిరక పనులు చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, అలాగే రైతులకు రావాల్సిన పరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు





**మైదుకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు మైదుకూరు కేంద్ర అధికారి ఎస్.అన్వర్ భాష ఆధ్వర్యంలో గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక కేంద్రం నుండి అగ్నిమాపక వాహనం, సిబ్బందితో స్థానిక శాంతినికేతన్ హైస్కూల్ నందు ఉపాధ్యాయులు, విద్యార్థులకు కరపత్రాలు పంచి అగ్ని ప్రమాదం జరిగినప్పుడు బహుళ అంతస్తులు ఏ విధంగా బయటికి రావలెను, పొగ గదిలో చిక్కుకున్న వారిని బయటికి రక్షించి తీసుకొని రావడంపై నీళ్లలో పడిన వాళ్లను రక్షించే విధానం మరియు గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రెస్క్యూ మెథడ్స్ ,సిపిఆర్ ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ మదన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ కోటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మరియు అగ్నిమాపక సిబ్బంది సత్యరాజు, వీరభద్రారెడ్డి, పవన్, లింగమయ్య, గౌస్, సతీష్ మోహన్, శ్రీనివాసులు రెడ్డి, క్రిష్ణ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది. మనం ఉన్న ప్రదేశాలలో ఎప్పుడైనా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 101, 8790201101 మరియు 9963737634 కు ఫోన్ నెంబర్ కు తెలియజేయాలని అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు ప్రజలకు తెలిపారు.

## ప్రభుత్వ బడిలో చేరండి..

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

ఏపీ విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిపిలుస్తోంది. కార్యక్రమంలో భాగంగా ఎగువపల్లి హైస్కూలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందంతో కలిసి ప్రభుత్వ బడిలో బాల బాలికలు చేరమని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడిలో వసతులు, నాణ్యమైన ఉచిత విద్య, సుశిక్షితులైన ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దోహదం చేసే సహపాఠ్య సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రభఉత్వ బడిలో చేరాలని కోరారు. స్థానికంగా ఎగువపల్లి, మైసూరా రెడ్డి కాలనీలో పిల్లల తల్లిదండ్రులను కలిసి కరపత్రాలు పంచి ప్రచారం చేయడం జరగింది. కార్యక్రమంలో హెడ్మాస్టర్ రమాదేవి, పీఎస్.ఎం.గౌరీశంకర్, ఉపాధ్యాయులు సలీంబేగ్, గునిశెట్టి శ్రీనివాసులు, తిరుమల కొండయ్య, రామకృష్ణారెడ్డి, ఖాదర్, పుష్పలత, బాలకృష్ణ, రవి, మమత తదితరులు పాల్గొన్నారు.



## రసవత్తరంగా సాగిన బహిరంగ వేలం పాట



**ముద్దనూరు,ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

జంతువధశాల, మార్కెట్ గేటు వసూళ్లను 2026, 27 సంవత్సరానికి రాబట్టడానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన బహిరంగ వేలం పాట ఎంతో ఉత్కంత భరితంగా సాగింది. గ్రామపంచాయతీ అధికారులు, డిఎల్‌పిఒ నూర్జహాన్, ఎంపీడీవో రాధాకృష్ణ వేణి ఆధ్వర్యంలో పోలీసుల పటిష్ట బందోబస్తు మధ్యన నిర్వహించారు. ఈ వేలంపాటలో మొదటి నుంచి పోటాపోటీగా సాగి గతంలో ఎన్నడు లేని విధంగా రామాంజనేయులు 42 లక్షల 63 వేల రూపాయలతో హెచ్చు పాట పాడి దక్కించుకున్నట్లు డిఎల్‌పిఒ నూర్జహాన్ తెలిపారు. 12 లక్షల 77 వేల రూపాయలు హెచ్చు వేలం పాట పాడి చెల్లుబోయిన శుభ రత్నమ్మ దక్కించుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వేలం పాటను దక్కించుకున్న వారు పంచాయతీ అధికారుల సూచించిన విధంగా మార్కెట్టు వచ్చు వాహనాలకు, జంతువధశాలలో ఫీజులు వసూలు చేయాలని అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుని వారి వేలం పాటను రద్దు చేస్తామని సూచించారు. బహిరంగ వేలం పాటకు సీఐ నగేష్ బాబు, కొండాపురం సీఐ రాజా ఎస్సై మధుసూదన్ రెడ్డి, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్సై మంజునాథ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ సమీపంలో దుకాణాలను మూసి వేయించి మార్కెట్లో ఏర్పాటు చేసి ముందస్తుగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ



**సుండుపల్లె, ఏప్రిల్ 17,ప్రభాతవార్త :**

మండలపరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఫ్రై డే డ్రై డే సందర్భంగా జిల్ల మలేరియా అధికారి డాక్టర్ మనోరమ మరియు ఎపిదామలాజిస్ట్ ఖాజామొద్దీన్ తనిఖీ చేసి పీహెచ్ సి నందు రికార్డ్స్ మరియు రిపోర్ట్స్ తనిఖీ చేసారు. అనంతరం వారు మాట్లాడుతు ప్రతి శుక్రవారం ఇంటి లోని నీటి పాత్రలు శుభ్రంగా కడిగి అర పెట్టి మరల నీటిని నింపాలని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమలు పెరగవని,ప్రతి ఒక్కరు దోమతెరాలు వాడాలని రాత్రి పూట వేపాకు వేసుకోవాలని, ఇంటి దగ్గర ఉన్న పని రాని టయర్లు, టెంకాయ చిప్పలు, లేకుండా చూసుకోవాలని,కూలర్ లు సుబ్రపరచుకోవాలని, ఇలా చేయడం వలన మలేరియా డెంగీ, చికెన్ గున్యా జ్వరాలు నివారించవచ్చునని చెప్పారుతెలియజేసారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ శేఖర్ రెడ్డి,డాక్టర్ రూబీనా ఎంపీఇ హెచ్ ఒ వీరనారాయణ స్టాఫ్ నర్స్ అనూష, హేమ, సాల్మహన్ హెల్త్ అసిస్టెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

# ప్రజలకు జనాభా గణన యొక్క ప్రాముఖ్యతపై అవగాహన

**మైదుకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మైదుకూరు మున్సిపాలిటీ కమిషనర్ రంగస్వామి జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణము నుండి శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్ వరకు భారతదేశ జనాభా గణన 2027 లో భాగంగా స్వీయ గణన పై మున్సిపాలిటీ లో మన బాధ్యత ను నెరవేరుద్దాం జనాభా గణనలో పాల్గొందాం నినాదాలు అవగాహన ర్యాలీ నిర్వహణలో ప్రజలకు జనాభా గణన యొక్క ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేశారు. జనాభా గణన అనేది కేవలం ప్రజల సంఖ్యను లెక్కించడం మాత్రమే కాదు,దేశ ప్రగతిని నిర్దేశించే అత్యంత కీలకమైన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి, రవాణా, గృహ వసతి వంటి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడానికి జనాభా లెక్కల సమాచారం మూలాధారం. ఏ ప్రాంతంలో ఎంత జనాభా ఉంది, వారి అవసరాలు ఏమిటి (నీరు, విద్యుత్, మరుగుదొడ్లు) అనే వివరాలను బట్టి బడ్జెట్ కేటాయింపులు మరియు వనరుల పంపిణీ, అక్షరాస్యత, వలసలు, కుల, మత, లింగ నిష్పత్తి, మరియు ఉపాధి పరిస్థితులపై ఖచ్చితమైన డేటాను ఇది అందిస్తుంది.జనాభా మార్పులు, వృద్ధాప్య జనాభా పెరుగుదల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, భవిష్యత్తు విధానాలను నిర్ణయించడానికి ఇది సహాయపడుతుంది. ఖచ్చితమైన జనాభా లెక్కలు మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి, సరైన సమాచారం అందిస్తేనే దేశం, రాష్ట్రం మరింత సమర్థవంతంగా అభివృద్ధి చెందుతాయి. కేంద్ర ప్రభుత్వ జనగణన విభాగం వారిచే ఇంటి జాబితా మరియు ఇంటి గణన 2026 కార్యక్రమం నిర్వహించబడుచున్నది. 16 ఏప్రిల్ 2026 నుండి 30 ఏప్రిల్ 2026 వరకు పౌరులు తమంతట తాముగా ఆన్లైన్లో వివరాలు నమోదు చేసుకోవచ్చును అధికారిక వెబ్సైట్: http://se.census.gov.in మరియు శీఘ్ కోడ్ స్కాన్ చేసి నేరుగా వివరాలు పూరించవచ్చు. స్వీయగణన చేయుటలో ఏమైనా సాంకేతిక సమస్యలు లేదా సందేహాలు తలెత్తిన యెడల టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెం:1855 కు కాల్ చేయవచ్చు. అదనంగా మీరు మీ వార్డు సచివాలయ సిబ్బంది లేదా మున్సిపల్ కార్యాలయ సిబ్బందిని సంప్రదించి సహాయం పొందవచ్చు.కావున మైదుకూరు పురపాలక సంఘ పరిధిలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,30042026 లోపు స్వీయ గణన పూర్తి చేసి, మన మైదుకూరును 100 శాతం గణన సాధించిన ఆదర్శ పురపాలక సంఘంగా నిలుపుటకు సహకరించ వలసినదిగా కమిషనర్ పిలుపునిచ్చారు.



## నీటిని పొదుపుగా వాడుకోవాలి..

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**



వేసవి కాలంలో పెరిగే ఎండల వల్ల నీటి కొరత తీవ్రమవుతుందనీ దీనికి తోడు వర్షాలు కురవలేదని, భూగర్భ జలాలు కూడా అడుగంటుతున్న పరిస్థితి. దీనిని అధిగమించడానికి నీటిని పొదుపుగా వాడుకోవాలని కడప కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్నారెడ్డి విజయకుమార్ రెడ్డి కడప నగర వాసులను కోరారు. రిజర్వాయర్లలో నీరు తగ్గుతుందని, నీటి డిమాండ్ పెరిగి నీటి కొరత సమస్యకు ఆస్కారం ఉన్న కారణంగా నీటిని అవసరానికి తగ్గట్లుగా, పొదుపుగా వాడుకోవాలని కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మునిసిపల్ పైపుల నుండి వచ్చు నీటిని నీటి ట్యాంకులలో నింపుకున్న తర్వాత మోటర్లతో వాడుకోవాలనీ తెలిపారు. అలా కాకుండా పైప్ లైన్లో నుంచి డైరెక్ట్ గా మోటార్ల ద్వారా నీటిని వాడుకుంటే అపరాధ రుసుముతో పాటుగా కులాయి కనెక్షన్ లను కూడా తొలగిస్తామన్నారు.

# బద్వేల్‌లో అక్రమ క్వారీపై ఆగ్రహం

- చర్యలు లేకపోతే అడ్డుకుంటామని హెచ్చరిక

**బద్వేల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

బద్వేల్ నియోజకవర్గంలో ప్రకృతి సంపద అయిన మట్టి, కంకర అక్రమంగా తరలింపుకు గురవుతున్నదని, దీనిపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ తీవ్రంగా ఆరోపించారు. స్థానిక సిపిఐ ఎం ఎల్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, గోపవరం మండలం శ్రీనివాసపురం-సంగసముద్రం మధ్య ఉన్న క్వారీకి లీజు గడువు ముగిసినప్పటికీ, ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కంకర తవ్వకాలు కొనసాగుతున్నాయని తెలిపారు. టన్నుల కొద్దీ కంకరను బయటకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. క్వారీ నిర్వహణపై ప్రశ్నించినప్పటికీ నిర్వాహకులు సరైన సమాధానం ఇవ్వకుండా తప్పుదోవ పట్టిస్తున్నారని, రాజకీయ అండదండలతోనే ఈ అక్రమాలు కొనసాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. సీనరేజ్ చార్జీలు చెల్లించకుండా పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు రావాల్సిన వాటాలను తప్పించుకుంటున్నారని విమర్శించారు.




ఇక బద్వేల్ పట్టణంలోని శివాలయం వెనుక ప్రాంతంలో రాత్రిపూట, సెలవు దినాల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా వందలాది ట్రిప్పులు కంకర తరలిస్తున్నారని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని, చిన్నపిల్లలు సంచరించే రహదారులపై ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ క్వారీ నిర్వహణపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేదంటే సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ తరఫున ప్రత్యక్షంగా వాహనాల రవాణాను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో విజయరావు, నారాయణ, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలి



**బద్వేలు అర్బన్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త :**

బద్వేల్ సీమాంక్ ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా కృషి చేయాలని పలువురు మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు,ఇటీవల సీమ్నాకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్గా ఎన్నికైన షేక్ జహంగీర్ భాషను శుక్రవారం మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు చినబాబు,యం,ఎస్ పి నాయకులు గంగిపోవు నరసింహులు ఘనంగా శాలువా పూలమాలతో సన్మానించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చురుకైన నాయకుడిగా పనిచేస్తున్న జహంగీర్ భాషకు పార్టీ అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తూ ప్రజలందరికీ అవసరమైన సీమాంక్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్గా ఎంపిక చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు ఆస్పత్రికి అవసరమైన మరిన్ని పరికరాలు తెప్పించి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు జహంగీర్ భాష కృషి చేయాలని భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసాద్. శ్రీను. మునయ్య మాజీ కౌన్సిలర్ రవిచంద్ర దానమయ్య రాజు మహబూబ్ బాషా ప్రదీప్ విక్రమ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## జన గణనకు సహకరించండి. తహసిల్దార్

**ముద్దనూరు,ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**



దేశవ్యాప్తంగా చేపడుతున్న జన గణనకు మండల ప్రజలు సహకరించాలని అధికారులు తమ ఇంటి దగ్గరికి వచ్చి వివరాలను అడుగుతే ఖచ్చితమైన వివరాలనే అధికారులకు ఇవ్వాలని మండల తహసిల్దార్ ఎండి అలీ ఖాన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. https://se.cencus.gov. . వెబ్ సైట్ నందు మీరే స్వయముగా నమోదుచేసుకొని దానికి సంబధించిన స్వీయగణన గుర్తింపు నెంబరును సెన్సస్ గణన అధికారులు మీ ఇంటి వద్దకు వచ్చిన పుడు స్వీయగణన (సెల్ఫ్ ఎన్యూ మరేషన్ ఐడి) గుర్తింపు నెంబరును వారికి తెలియజేస్తే సంబంధిత ఎన్యుమరేటర్లు వాటిని పరిశీలించి మీ వివరాలను పూర్తి చేయగలరన్నారు.

## రూ. 5 లక్షలు వితరణ

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**



బిజెపి మైనార్టీ మోర్చా కడప జిల్లా అధ్యక్షులు షేక్ ఇలియాస్ బాషా మరణించడం బాధాకరమని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ భాష, బిజెపి రాష్ట్ర కార్యదర్శి వంగల శశిభూషణ్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, నేచర్ వెల్ఫేర్ కౌన్సిలర్ కడప జిల్లా చైర్మన్ బత్తల పవన్ కుమార్ అన్నారు. శుక్రవారం కడపలో బిజెపి మైనార్టీ మోర్చా కడప జిల్లా అధ్యక్షులు షేక్ ఇలియాస్ భాష కుటుంబాన్ని బిజెపి నాయకులు పరామర్శించారు. రూ. 5 లక్షలు వితరణ చేశారు. ఆయన భార్యకు ఉద్యోగం కల్పిస్తూ వారి పిల్లలకు చదివినంత కాలం చదువు చెప్పించే భరోసా ఇచ్చారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. పరామర్శించిన వారిలో బిజెపి నాయకులు బీరం సుబ్బారెడ్డి, శాలివాహన, గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్ లు పరామర్శించారు.

## ఇంటర్ ఫలితాల్లో పూర్వ విద్యార్థుల ప్రతిభ

**వేంపల్లి:ఏప్రిల్ 17 (ప్రభాతవార్త)**





బుధవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో తేజ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. వసంతకుమారి బైపీసీ లో 433 మార్కులు సాధించిఅలాగే షేక్, మౌలాలి ఎంఈసీలో 493మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ మహదేవారెడ్డి హెచ్ ఎమ్ నాగేశ్వారమ్మలు తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందము అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : జగన్ మోహన్ రాజు






**సిద్ధవటం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన సిద్ధవటం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని గత వైసీపీ పాలనలో రెవెన్యూ డీకేటి భూములను వైసీపీ ప్రజా ప్రతినిధులు దోచుకున్నారని దోచుకున్న భూములను తిరిగి పేదలకు పంచేందుకు రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో త్వరలో అసైన్ కమిటీ ఏర్పాటు చేసి నిరుపేదలకు భూములు పంచుతామని తెలిపారు ఇటీవల రాష్ట్ర కమిటీ లో సిద్ధవటం మాజీ మండల అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డికి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మోహన్ రెడ్డిని ఇంచార్జ్ చమర్తి నాయకులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు ప్రతి గ్రామంలో టిడిపి జెండా ఎగురవేయాలని జ్యోతి ఖాదర్ బంగ్లా వంతెన నిర్మాణ పనులు చేపట్టేందుకు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇచ్చిన వాగ్దానం అమలు చేస్తామని వైసిపి నేతలకు కొంతమంది టిడిపి నేతలు వాళ్ల పనులు చేస్తున్నట్లు కార్యకర్తలు మా దృష్టికి తీసుకొచ్చారని అటువంటి వారిని ఉపేక్షించే పరిస్థితి లేదని అన్నారు టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ వ్యక్తులకు రాష్ట్ర అధినాయకత్వం గుర్తింపు ఇస్తుందని నాకు రాష్ట్ర కార్యదర్శిగా నియమించిందని తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తానని పార్టీ కోసం అందరం ఏకతాటిపైకి వచ్చామని రాబోయే స్థానిక ఎలక్షన్లో వైసిపి భూస్థాపితం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు రాజశేఖర్, యాదవ్ రాష్ట్ర దూదేకుల సంక్షేమ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వీరభద్రుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య సింగిల్ విండో అధ్యక్షులు దశరథ నాయుడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు చెంచయ్య నాయుడు సిద్ధవటం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రతినిధి పార్ల రాంప్రసాద్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగమునిరెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వీరనాల రామచంద్రయ్య బీసీ నేత పుత్తబాబు మాజీ జెడ్పీటీసీ సభ్యులు చలమయ్య యాదవ్ గంజి సుబ్బరాయుడు ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు పార్ల శ్రీనివాసులు మండల తెలుగుదేశం పార్టీ నాయకులుకార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బహిరంగవేలం

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన కొన్ని నెల బాడుగకు అంగడి పెట్టుకుని అమ్ముకొనే హక్కుకు గాను బహిరంగ వేలం పాటను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతీ ప్రసాద్ తెలిపారు. బహిరంగ వేలం పాటలో హిందువులకు మాత్రమే హక్కు కలదన్నారు. మరిన్ని వివరాలకు తమను సంప్రదించాలని కోరారు.

## రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్పను కలిసిన కిల్లా విజయ్ కుమార్



పీలేరు , ఏప్రిల్ 17 ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో శుక్రవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు పి. వెంకటప్పను ఆంధ్ర ప్రదేశ్ గిరిజన యానాది సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లా విజయ్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో గిరిజనులపై, గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులు, అన్యాయాల గురించి ఆయనకు వివరించారు. అలాగే అభివృద్ధికి నోచుకోని యానాది గిరిజనుల దయనీయ పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గిరిజనుల యొక్క పలు సమస్యలను ప్రస్తావిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా గిరిజనులపై, ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,యానాది గిరిజనులకు నివాస, విద్య, ఆరోగ్య సదుపాయాలు మెరుగుపరచాలని .అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు భూములపై పూర్తి హక్కులు కల్పించాలని .గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచి, వలసలను నివారణ చర్యలు చేపట్టాలని ,ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని కోరారు.గిరిజనుల సమస్యలపై స్పందించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు పి.వెంకటప్ప, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు.

## విద్యకు పేదరికం అడ్డుకాదు

### వెలుగుస్కూల్ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి



విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : విద్యకు పేదరిక అడ్డుకాదని, కృషి సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చునని వెలుగు స్కూల్ సెక్రటరీ ఎం.ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలను ఇంటర్ ఫలితాల్లో సంచలనం సృష్టించిన శ్రీ విద్యావికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెట్ శివశంకర్ విద్యార్థులతో కలసి వెలుగుస్కూల్‌లోని దివ్యాంగులను, వృద్దులను పలకరించారు. ఈసందర్భంగా స్కూల్ సెక్రటరీ విద్యార్ధిని, విద్యార్థులకు ఘనస్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపి, శాలువతో ఘనంగా సత్కరించి మోమెంటోలు అందజేశారు. అనంతరం కరస్పాండెంట్ శివశంకర్ మాట్లాడుతూ వెలుగుస్కూల్‌లో దివ్యాంగులకు, వృద్దులకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, వార్డెన్ స్వీటి, సోషల్‌వర్కర్ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎద్దులవారికోట అంగన్వాడీలో పోషణ పక్వాడ



తంబళ్లపల్లె ఏప్రిల్ 17 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె మండలం ఆర్‌ఎం తండా ఎద్దులవారి కోట అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రమణమ్మ మాట్లాడుతూ తల్లులు, గర్భవతులు, బాలింతలు పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక దుష్ప్రభావాలు సంభవిస్తాయని కావున బాలికలకు 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహార స్టాల్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బురుజు పల్లి రమణమ్మ, ఆర్ ఎన్ తాండా సుగుణ, ఎద్దుల వారి కోట ప్రమీలమ్మ, ఎద్దుల వేమన్న గారి పల్లె నాగరత్న హెల్పర్లు, తల్లులు, గర్భవతులు , బాలింతలు పాల్గొన్నారు.

## బైరెడ్డిపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా బాలకృష్ణ నాయక్



తంబళ్లపల్లె ఏప్రిల్ 17 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న ఎం బాలకృష్ణ నాయక్ చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవో గా పదోన్నతి పొందారు. బాలకృష్ణ నాయక్ పదోన్నతి పై ఎంపీడీవో బాపూజీ పట్నాయక్, ఏవో థామస్ రాజా, డిప్యూటీ ఎంపీడీవోలు ప్రసాద్, మారుతీ కుమార్,టైపిస్ట్ సురేంద్ర,జూనియర్ అసిస్టెంట్ విజయ్, ఆర్డబ్ల్యూఎస్ ఎఈఈ వినోద్ కుమార్,పి.ఆర్ ఏ ఈ రమణ, ఏపిఎం గంగాధర్, ఏ పీ ఓ అంజనప్ప, ఆఫీస్ సబార్డనేట్లు నాగరాజు, ఖయ్యూం, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## మనసు దోచుకొంటున్న "దేవగన్నేరు"



విరబూసిన దేవగన్నేరు

చౌడేపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త దేవతలకు అతి ప్రీతిపాత్ర మైన " గన్నేరు "చెట్టు విరబూసి అందరి మనసును దోచుకొంటోంది. చౌడేపల్లి పరిధి లోని గోసలకురపల్లిలో గల కాశీవిశ్వేశ్వరాలయం ముందు న్న దశాబ్దాలనాటి దేవగన్నేరు చెట్టు నిండా విరబూసి అందరినీ ఆకర్షిస్తోంది. తరాలుగా చెట్టు ప్రతి వేసవిలోనూ విరగ్గాస్తోందనీ, ఈ ప్రాంతమంతా సువాసన వెదజల్లుతోందని స్థానికులంటున్నారు.

# ఆరాధన గురుపూజ మహోత్సవాలు పకడ్బందీగా నిర్వహించండి

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 17 ప్రభాతవార్త ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఈనెల 23 వ తేదీ నుండి 28వ తేదీ వరకు జరుగుతున్న వేడుకలను పురస్కరించుకుని ఆర్డీవో చంద్రమోహన్ అధ్యక్షతన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్త సమూహం విచ్చేస్తున్న అతి పెద్ద ఉత్సవం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురు పూజ మహోత్సవాలు ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్వామివారిని సకాలంలో దర్శనం చేసుకుని తృప్తిగా తిరిగి ఇంటికి వెళ్లేటువంటి ఏర్పాట్లను మనం చేయాలని దానికి సంబంధించినటువంటి విధివిధానాలను అధికారులకు ఆయన వివరించారు.ప్రధానంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ రవాణా శాఖ వైద్య ఆరోగ్యశాఖ పంచాయతీరాజ్ శాఖ విద్యుత్ శాఖ పోలీస్ శాఖ,అధికారులు ఎప్పటికప్పుడు పనులను సమీక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన సూచించా రు. ఇప్పుడు ఉన్నది వేసవికాలం దృష్టిలో ఉంచుకొని భక్తులకు త్రాగునీరు సౌకర్యం మజ్జిగ పంపిణి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అలాగే క్యూలైన్లు పకడ్బందీగా ఏర్పాటు చేసి ఎక్కడ తొక్కిసలాట జరగకుండా భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలాగా ఏర్పాట్లు చేయాలన్నారు.అలాగే అగ్నిమాపక సిబ్బందితో మాట్లాడి ప్రమాదం జరగకుండా ముందుగా రెండు అగ్నిమాపక వాహనాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఎంపీడీవో రామచంద్ర రెడ్డి తాసిల్దార్ కార్తీక్,సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్, మఠం మేనేజర్ ఈశ్వరయ్య చారి,సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## తంబళ్లపల్లెలో కిషోర్, కొండ్రెడ్డి ఫ్లెక్సీల చించివేత

### నిందితులను అరెస్టు చేయాలని ధర్నాఉద్రిక్తత, స్తంభించిన ట్రాఫిక్.






తంబళ్లపల్లె ఏప్రిల్ 17 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, రాష్ట్ర టిడిపి కార్యదర్శి మద్ది రెడ్డి కొండ్రెడ్డి, టిడిపి నాయకుల భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. క్రాస్ రోడ్‌లో గురువారం రాత్రి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, రాష్ట్ర టిడిపి కన్వీనర్ మద్దిరెడ్డి కొండ్రెడ్డిల ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించి వేశారు. ఈ విషయమై శుక్రవారం రాష్ట్ర టిడిపి కార్యదర్శి కొండ్రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కార్యకర్తలతో క్రాస్ రోడ్‌లో వాహనాల అడ్డం పెట్టి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఫ్లెక్సీల చించివేత తెలుసుకున్న పలు మండలాల నుండి స్వచ్ఛందంగా వాహనాలలో టిడిపి నాయకులు, కార్యకర్తలు కొండ్రెడ్డి స్వగృహం చేరుకొన్నారు. అక్కడి నుండి కొండ్రెడ్డి టిడిపి కార్యకర్తలతో ర్యాలీగా పాత బస్టాండ్ మీదుగా క్రాస్ రోడ్డు చేరుకొని మొలకలచెరువు క్రాస్ రోడ్డుకు అడ్డంగా ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ జిందాబాద్, కొండ్రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, ఫ్లెక్సీలుచించిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలి నినాదాలతో హోరెత్తించారు. ప్రధాన రహదారిలో ధర్నా జరుగుతుండడంతో ఆర్టీసీ సర్వీసులు, వాహనాలతో పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కొండ్రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని హక్కు ప్రతి ఒక్కరికి ఉందని మా ఫ్లెక్సీలు చించివేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎవరైనా దమ్ముంటే ధైర్యంగా ఎదుర్కోవాలని ఫ్లెక్సీల మీద ప్రతాపం చూపడం పిరికి బంధ చర్యగా అభివర్ణించారు. ఫ్లెక్సీలు చేసిన వారిని అరెస్టు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ ఆందోళన కార్యక్రమాల్లో నియోజకవర్గం లోని ఆరు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

### టిడిపిలో కష్టపడ్డ వారికి

## ప్రాధాన్యత ఎక్కడ

### సీనియర్ నాయకులు ఆర్‌జె.వెంకటేష్ ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ వారికి ప్రాధాన్యత ఎక్కడ ఉందంటూ సీనియర్ నాయకులు ఆర్‌జె.వెంకటేష్ ఆరోపించారు. శుక్రవారం నిమ్మనపల్లె సర్కిల్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకే కుటుంబంలో ఇద్దరికి నామినేటెడ్ పదవులా అంటూ ప్రశ్నించారు. పార్టీ అధికారంలో ఉన్నపటికి పార్టీకోసం నిజంగా పనిచేసిన వారికి గౌరవం దక్కడం లేదన్నారు. ఇందుకు తానే నిదర్శనమని, అధిష్టానం ఏ అంశాలన పరిగణలోకి తీసుకొని నామినేటెడ్ పదవులు కేటాయిస్తుందో అర్థం కావడం లేదన్నారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి కుటుంబానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశామని, అందులో భాగంగా జరిగిన ఘర్షణలో రాటకొండ మధుబాబు లాంటివారు తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి జిల్లాలో టిడిపి విజయంలో క్రియాశీలక పాత్ర పోషించారని ఆయనతో కలసి తామందరం కష్టపడ్డామని తెలిపారు. ఆయన సేవలను గుర్తించకపోవడం తీవ్ర నిరాశకు గురి చేస్తోందన్నారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన మంత్రి లోకేష్ క్షేత్రస్థాయిలో విచారించి పార్టీకోసం పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాటకొండ మధుబాబు, విజయమ్మ, శ్యామల, రామక్రిష్ణ, రేగడ ప్రసాద్‌కుమార్, మల్లికార్జున, రెడ్డప్పలు పాల్గొన్నారు.

## దొడ్డిపల్లె గ్రామంలో ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ హాజరైన జడా శ్రావణ్ కుమార్, ములబాగల్ ఎమ్మెల్యే సంవృద్ధిమంజునాథ్



రామసముద్రం ఏప్రిల్ 17 ప్రభాతవార్త రామసముద్రం మండలం కురిజలగ్రామ పంచాయతీ దొడ్డి పల్లె గ్రామంలో డాక్టర్ బి. అంబేద్కర్ విగ్రహాన్ని హై కోర్టు మాజీ జడ్జి, అడ్వాకెట్ జడశ్రావణ్ కుమార్ కర్ణాటక రాష్ట్రం ములబాగల్ డైనమిక్ ఎమ్మెల్యే సంవృద్ధి మంజునాథ్,పుంగనూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏపీ కాంగ్రెస్ నాయకులు మురళి యాదవ్ కలిసి ఘనంగా ఆవిష్కరణ చేశారు.వీరిని బానసంచాలు కాలుస్తూ డప్పువాయిద్యాలు, గజ మాలలతో ఘనంగా స్వాగతం పలికి మహిళలు హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు, గ్రామస్థులు దొడ్డిపల్లె అంబేద్కర్ యువసేన, మండల కేంద్ర అంబేద్కర్ సంఘ నాయకులు, యువత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సి, ఎస్టీ ప్రముఖులు పాల్గొన్నారు. ములబాగల్ ఎమ్మెల్యే సంవృద్ధి మంజునాథ్ మాట్లాడుతూ మీమండలం పక్కనే జన్మించానని శ్రీనివాసపురం తాలుక లో ఒక సాధారణ కుటుంబములో జన్మించానని ఒకరి ఇంటిలో ఉండి చదువుకొని ఇతర దేశాలకు వెళ్లి అక్కడ కొన్ని సంవత్సరాలు ఉండి తిరిగి బెంగళూరు వచ్చి 200 మందితో చిన్న చిన్న బిజినెస్ లు పెట్టి ములబాగల్ ఎమ్మెల్యే అయ్యానని ప్రతి ఒక్కరికి ఒకటే చెపుతున్న బాగా చదివి కష్టపడి పైకి రావాలని, ఎవ్వరో ఇస్తారని మనం ఆశించుకోరాధని మనం కష్ట పడి పైకి రావాలని,ఉన్నతమైన పదవిలో ఉంటే ప్రతిఒక్కరూ గౌరవం ఇస్తారన్నారు. నేను ప్రతి రోజు జడ శ్రావణ్ కుమార్ ఇంటర్వ్యూలు చూస్తుంటానన్నారు, ఆయన మాటలు వింటే రోమాలు చలించిపోతాయన్నారు, ప్రతిఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు, ఏపీ రాష్ట్ర మాజీ హైకోర్ట్ జడ్జి, అడ్వకెట్ నాయకులు మాట్లాడు తూ అంబేద్కర్ కేవలం ఒక కులానుకో, వర్గానికో పరిమితమైన నాయకుడు కాదు, ఆయన దేశం గర్వించదగ్గ గొప్ప మేధావి ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలి, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహాను భావుడు అంబేద్కర్ అని అన్నారు. నేను చిన్నప్పటి నుంచి కష్టాలు మీద బతికానని చదువు రోజులు అంత హాస్టల్లో చదివానని హాస్టల్లో పనికిరాని నూక బియ్యంతో అన్నం చేసి పెట్టేవారని ఆ అన్నం తింటే కడుపు కాలేదని కడుపు మార్చుకుని చదివి ఉన్నత మైన హైకోర్టు జడ్జి అయ్యానని, ముఖ్యంగా యువతకి ఒకటే చెపుతున్న మంచిని ఎన్నుకొండి చెడుని వదిలేయండని ఇప్పుడు జనరేషన్ ఫేసుబుక్, ఇన్స్టాగ్రామ్, రీల్సుకి అలవాటు పడ్డారని వాటి వల్ల యువత చాలా చేసుపోతూన్నారని అమ్మాయిలు 17 అబ్బాయిలు 19 ఏళ్లకు ప్రేమలు జోలికి వెళ్లి మైనర్లు తీరక జైల్లో ఉన్నారన్నారు వాటి జోలికి పోకుండా యువత మంచి ప్రయోజకులు కావాలన్నారు. మురళీ యాదవ్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నన్ను ఆహ్వానంపలికి నందుకు దొడ్డిపల్లె గ్రామప్రజలకు, మండలకేంద్ర అంబేద్కర్ యువతకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జడశ్రావణ్ కుమార్, ఎమ్మెల్యే సంవృద్ధి మంజునాథ్, గొల్లపల్లె జగదీశ్, మండల అంబేద్కర్ యువసేన, దొడ్డిపల్లె గ్రామస్థులు, భాస్కర్, అంబరీష్, శేషు, నరసింహులు, పురుషోత్తం మెకానిక్ వెంకటేష్,భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై హృషికేశవరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

## రాష్ట్ర ఏస్సీ కమిషన్ మెంబెర్ శ్రీపతిబాబుకు స్వాగతం పలికిన అరికెల పవన్ కుమార్ వీరణాల



రామసముద్రం ఏప్రిల్ 17 ప్రభాతవార్త మదనపల్లి పల్లె నియోజకవర్గం పరిధిలోని వేంపల్లి నందు ఒక కేసు విచారణ విషయంగా మదనపల్లికి విచ్చేసిన స్టేట్ ఎస్సి కమిషన్ మెంబెర్ డాక్టర్.శ్రీపతి బాబుని కమిటీ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి సాదర స్వాగతం పలికిన రామసముద్రం మండలం అరికల గ్రామపంచాయతీ అరికెల వీరనాల పవన్ కుమార్ అడ్వకెట్ మిత్ర బృందం పలు విషయాలు చర్చించుకున్నారు, ఈ సమావేశంలో శ్రీనివాసులు,జైభీమ్ గంగాధర్, చంద్రశేఖర్,జయ శంకర్,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## రేకులషెడ్డును తొలగించిన అధికారులు



షెడ్డుకున్న రేకులను తొలగిస్తున్న అధికారులు

చౌడేపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త స్థానిక మండల పరిపాలనా భవనం ఎదు టువున్న రేకులషెడ్డును అధికారులు తొలగించారు. ప్రభుత్వ కార్యాలయం ఎదుట స్థలాన్ని దురాక్రమణ చేసుకొని రేకులషెడ్డును ఏర్పాటు చేశారని సింగిల్‌విండో ఛైర్మన్ హరిరాయల్ తేదేపా నాయకులతో కలసి ఎంపిడిఓ లీలా మాధవికి వినతిపత్రమందించిన విషయం విధితమే. ఈ విషయం పత్రికల్లో రావడంతో స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వ స్థలంలోని రేకులషెడ్డు తొలగించాలని ఆదేశించినట్లు తహశీల్దార్ భూపతి పార్వతి, ఎంపిడిఓ లీలా మాధవిలు తెలిపారు. తొలుత మండల పరిషత్ కార్యాలయం చుట్టూ సర్వేచేసారు. అనంతరం రేకులషెడ్డును తొలగించే చర్యలు చేపట్టారు. కాగా దురాక్రమణకు గురైన ప్రాంతాల్లో నిర్మితమైన కట్టడాలను తొలగించాలని పలువురు అధికారులను నిలదీశారు.

## జలధార ప్రాజెక్ట్‌పై కేంద్ర బృందం ప్రశంసలు

### తక్కువ ఖర్చుతో అధిక ఫలితాలు – నీటి సంరక్షణలో అన్నమయ్య జిల్లా ఆదర్శం

### క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్ర జలశక్తి బృందం





మదనపల్లె, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లాలో అమలు చేసిన జలధార–జలహారతి ప్రాజెక్ట్ పనితీరుపై కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన బృందం ప్రశంసలు వ్యక్తం చేసింది. ఈ నెల 16న జిల్లాకు విచ్చేసిన కేంద్ర బృందం గురు, శుక్రవారాల్లో వైకోట, చిట్వేలు, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, ఓబులవారిపల్లె, రామాపురం, బి.కొత్తకోట, కురబలకోట, చిన్నమండెం, సిటిఎం, పసినికొండ, రాయచోటి మండలాల్లో విస్తృతంగా పర్యటించి జలధార ప్రాజెక్ట్ అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించింది.కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సూచనల మేరకు సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, నేషనల్ వాటర్ మిషన్, సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారులతో కూడిన బృందం జిల్లాకు చేరుకుని, తక్కువ వ్యయంతో ఎక్కువ ఫలితాలు సాధించే విధంగా చేపట్టిన నీటి సంరక్షణ చర్యలను అధ్యయనం చేసింది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో అమలైన ప్రణాళికలు, నివేదికలు మరియు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన బృందం, నివేదికలలో పేర్కొన్న అంశాలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసింది.శుక్రవారం సాయంత్రం మదనపల్లి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసిన కేంద్ర బృందం, తమ పరిశీలనలో గమనించిన ముఖ్య అంశాలను వివరించింది. జిల్లాలో బేసిన్ ఆధారిత నీటి సంరక్షణ విధానాన్ని అనుసరించి నదీ పరివాహక ప్రాంతాలను గుర్తించడం, మిగులు నీటిని లోటు ప్రాంతాలకు మళ్లించడం వంటి చర్యలు సమర్థవంతంగా అమలయ్యాయని పేర్కొంది.జిల్లాలో 49 ఉప పరివాహక ప్రాంతాలను గుర్తించడం, 532 కాస్కేడ్ల ద్వారా 3,082 చెరువులను అనుసంధానం చేయడం, 962 ఎండిపోయిన చెరువులను పునరుద్ధరించడం, ఉపాధి హామీ పథకం ద్వారా విస్తృతంగా పనులు చేపట్టడం వంటి చర్యలు నీటి వినియోగాన్ని గణనీయంగా మెరుగుపర్చినట్లు కలెక్టర్ వివరించారు. ఈ అంశాలపై కేంద్ర బృందం ప్రత్యేకంగా ప్రశంసలు వ్యక్తం చేసింది.జలధార ప్రాజెక్ట్ అమలైన ప్రాంతాల్లో బోర్‌వెల్ లోతు గణనీయంగా తగ్గినట్లు, జలధార అమలు కాని ప్రాంతాలతో పోలిస్తే సుమారు 800 అడుగుల వరకు వ్యత్యాసం ఉన్నట్లు కేంద్ర బృందం గమనించింది. అలాగే ఉద్యాన సాగు విస్తీర్ణం 20 వేల హెక్టార్ల అంచనాతో పోలిస్తే 24 వేల హెక్టార్లకు పైగా పెరగడం ప్రాజెక్ట్ విజయాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొంది.కేంద్ర బృందంలో హైదరాబాద్ రీజినల్ కార్యాలయం నుండి సైంటిస్ట్‌డి సుధీర్ కుమార్, నేషనల్ వాటర్ మిషన్ సైంటిస్ట్‌బి నిఖిల్ కుమార్, సెంట్రల్ వాటర్ కమిషన్‌కు చెందిన ఎస్‌డీఈ అరుణ్ కుమార్, రిటైర్డ్ జలవనరుల శాఖ జిల్లా అధికారి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

## దగ్ధమైన మామిడితోట పరిశీలన



గాలివీడు, ఏప్రిల్ 17. ప్రభాతవార్త. మండలంలోని అరవీడు గ్రామ పరిధి దిన్నేమీదపల్లి వద్ద అగ్నిప్రమాదంలో దగ్ధమైన మామిడి తోటను శుక్రవారం రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 1666లో ఉన్న చిన్నకోట్ల రెడ్డప్పకు చెందిన మామిడి తోటలో గురువారం ప్రమాదం సంభవించింది.ఈ ఘటనలో మొత్తం 10 మామిడి చెట్లు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. అందులో ఒక చెట్టు పూర్తిగా కాలిపోగా, మరో 9 చెట్లు పాక్షికంగా దెబ్బ తిన్నాయన్నారు. అగ్నిప్రమాదం అనుకోకుండా జరిగినదిగా స్థానిక విచారణలో భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో రైతుకు గణనీయమైన పంట నష్టం వాటిల్లిందని, బాధిత రైతుకు ప్రభుత్వ నియమావళి ప్రకారం తగిన పరిహారం మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు గ్రామ రెవెన్యూ అధికారి వెల్లడించారు.

### బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు

## అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన



**బద్వేలు. అర్బన్, ఏప్రిల్ 17, ప్రభాత వార్త**

అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్ని మాపక కేంద్ర ఆధ్వర్యంలో 4వ రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం బద్వేల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బరెడ్డి అధ్యక్షత వహించారు. అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు కరపత్రాలు పంచి అగ్నిప్రమాదాల నివారణ, వాటిని ఆర్పే పద్ధతులపై వివరణ ఇచ్చారు. అలాగే, పై అంతస్తుల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులను తాడుతో సురక్షితంగా క్రిందికి దింపే విధానం ప్రదర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో ఇవ్వాల్సిన ప్రథమ చికిత్సపై కూడా అవగాహన కల్పించారు. మహిళా ఉపాధ్యాయులకు గ్యాస్ సిలిండర్ల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వేసవి కాలంలో చెరువులు, నీటి కుంటల్లో ఈత కొట్టేటప్పుడు పాటించాల్సిన భద్రతా సూచనలు, జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు.

## నీటి సంరక్షణ మన అందరి బాధ్యత..



**సుండుపల్లె, ఏప్రిల్ 17,ప్రభాతవార్త :**

మండలపరిధిలోని తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జలపక్వాడ వాటర్ కన్జర్వేషన్ ఇన్ స్కూల్ అండ్ హోమ్స్ గురించి మండల విద్యాశాఖ అధికారి రవీందర్ నాయక్ పాఠశాలలను సందర్శించి పాఠశాల నందు విద్యార్థులకు గొప్ప అవగాహన కల్పించే నీటి సంరక్షణ గురించి బావిభారత పౌరులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమము నందు పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు ఆర్ చంద్రశేఖర్ పాల్గొనడం జరిగినది ఈ కార్యక్రమము చాలా అర్థవంతరంగా ప్రజలలో కల్పించుట కొరకు ఎంఈఓ తో కలిసి గ్రామమునందు ర్యాలీ కూడా నిర్వహించడం జరిగినది గ్రామస్తులు స్పందన ఈ సందర్భంగా చాలా ప్రశంసనీయంగా ఉన్నది.

### అగ్ని ప్రమాదాలపై

## విద్యార్థులకు అవగాహన అవసరం



అగ్ని ప్రమాదంపై విద్యార్థినికి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**రాజంపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

విద్యార్థులకు అగ్నిప్రమాలపై అవగాహన అవసరమని రాజంపేట అగ్నిమాపక కళ అధికారి పివి రాధాకృష్ణ తెలిపారు. ప్రతి విద్యార్థి అగ్నిప్రమాదాలకు సంబంధించి ప్రమాద సమయంలో ఎలా స్పందించి చర్యలు తీసుకోవాలో, ఆదుకోవాలో, రక్షించాలో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీలో శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలో డెమో చేయించారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు రాజంపేట అగ్నిమాపక కేంద్రమునకు 08565240299 (101) లేదా 9963479554 సమాచారము అందించాలని తెలిపారు. అలాగే అక్కడ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు కరపత్రములు సిబ్బంది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో రాజంపేట అగ్నిమాక సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్దులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**సిద్ధవటం ఏప్రిల్ 17 ప్రభాతవార్త**



అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై హారిక పేర్కొన్నారు మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్లో ఆమె శుక్రవారం మాట్లాడుతూ లింగంపల్లి గ్రామంలో ముని సుబ్బరాయుడు అక్రమమద్యం విక్రయిస్తున్నట్లు మాకు రాబడిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించి 13 లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు అక్రమ మద్యం, కోడి పందేళ్ల జూదం, గంజాయి వంటి మత్తుపదార్థాలను విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కొండయ్య కానిస్టేబుల్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ నిబద్ధతకు సేవ పురస్కారం

**సుండుపల్లి, ఏప్రిల్ 17,ప్రభాతవార్త :**



కడప జిల్లా సుండుపల్లి పోలీస్ స్టేషన్లో కోర్ట్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న ఈశ్వర్‌కు ఉత్తమ సేవా పురస్కారం ప్రదానం చేశారు. ఈ అవార్డును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి టి. సుయోధన్ అందజేశారు. విధి నిర్వహణలో ఆయన చూపిన క్రమశిక్షణ, నిబద్ధతకు గుర్తింపుగా ఈ పురస్కారం అందించారు. ముఖ్యంగా సాక్షులను సమయానికి కోర్టుకు హాజరుపరచడం, ముద్దాయిలపై శిక్షల అమలులో సమర్థవంతంగా వ్యవహరించడం ద్వారా ఈశ్వర్ మంచి పేరు సంపాదించారు. ఆయన కర్తవ్యనిష్ఠ, అంకితభావాన్ని మెచ్చుకున్న ఉన్నతాధికారులు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా సహచర సిబ్బంది, ఈశ్వర్‌ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### అయ్యప్ప ఆలయంలో వారాహిమాతకు

## అమావాస్య ప్రత్యేక పూజలు, హోమాలు





**రాజంపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

రాజంపేట పట్టణం జాతీయ రహదారిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం వైశాఖ అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మూలవిరాట్ కు పంచామృత అభిషేకాలను చేశారు. అనంతరం వారాహిమాతకు ప్రత్యేక పూజ, అష్టోత్తర శతనామావళి చేశారు. వారాహి మాతకు ప్రత్యేక పూజలతో పాటు , ప్రత్యేక హోమ కార్యక్రమాలను నిర్వహించారు. మిరపకాలతో జరిగే హోమ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి కొండా సత్యనారాయణ, ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ, దాము ఆచారి, పులి కృష్ణ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## వయోజన విద్యాకేంద్రాల ఏర్పాటు




**బద్వేలు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

చదువు రానివారికి విద్య అందించాలనే లక్ష్యంతో బద్వేల్ ప్రాంతంలో వయోజన విద్యాకేంద్రాల ఏర్పాటు జరుగుతోంది. లెటర్స్ ఇండియా ట్రస్ట్ వారి ఆర్థిక సహాయంతో మమ్రే ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. మమ్రే ఫౌండేషన్ 2024లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, గత ఏడాది కలసపాడు మరియు బద్వేల్ మండలాల్లో పది గ్రామాల్లో రాత్రి పాఠశాలల ద్వారా విద్యను అందించారు. ఈ ఏడాది బద్వేల్ మండలంలోని నందిపల్లి, కొత్తచెరువు, వీరబల్లె, ఫాదర్ వాండర్వాక్ నగర్ మరియు బి మఠం మండలంలోని ఎన్ గొల్లపల్లె, గ్రామాల్లో కొత్త విద్యాకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఫౌండేషన్ అధినేత, వయోజన విద్యా పీఠ డాక్టర్ సుందరం తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాలు చర్చి పాస్టర్ పాస్టర్ రెవరెండ్ డా. జి. మధుకర్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాబోధనకు అవసరమైన పుస్తకాలు, పలకలు, బ్లాక్ బోర్డులు వంటి సామగ్రిని వాలంటీర్లకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మమ్రే ఫౌండేషన్ సిబ్బంది, విద్యా వాలంటీర్లు జింకా శాంతమ్మ, చందన, మాధవి, సౌందర్య, , గుర్రమ్మ, లక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ స్థలాలలో

## హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



**సిద్ధవటం ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతాలు చేసిన ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని సిద్ధవటం మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రమైన సిద్ధవటం తాసిల్దార్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రభుత్వ రెవెన్యూ డీకేటి పొలాలు, స్థలాలు అన్యాక్రాంతాలు చేసిన ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని పెద్దపల్లి రెవిన్యూ సర్వేనెంబర్,870/3 నందు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిత చేసిన ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని మరి కొన్ని ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ రెవెన్యూ డికెటి పొలాలు ఆక్రమిత చేస్తే కఠినమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తావని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### డాక్టర్ క్రాంతి కుమార్‌ను సన్మానించిన

## ఆర్.ఎస్ ఫౌండేషన్ చైర్మన్

**బద్వేలు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

బద్వేల్ పట్టణంలో సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిచ్చే ఆర్.ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సీమాంక్ ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన దివ్య హాస్పిటల్ డాక్టర్ క్రాంతి కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్.ఎస్ ఫౌండేషన్ చైర్మన్ మరియు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మానుగుంట రవిశంకర్ శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైనవారు డాక్టర్ క్రాంతికుమార్ సేవలను కొనియాడుతూ, ఆయన వైద్య రంగంలో చేస్తున్న సేవలను ప్రశంసించారు. మానుగుంట రవిశంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యశాలకు ప్రధానంగా నిరుపేద ప్రజలే ఆశ్రయిస్తారని, అందువల్ల వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థల ద్వారా అందే అన్ని సదుపాయాలు నిజంగా అర్హులైన పేదల వరకు చేరేలా కృషి చేయాలని సూచించారు. అలాగే డాక్టర్ క్రాంతికుమార్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, పేదలకు అండగా నిలిచి, సేవాభావంతో వైద్య రంగంలో మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సన్మానం కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగుతూ, పాల్గొన్న వారందరిలో సేవా స్ఫూర్తిని పెంపొందించేలా సాగింది. డాక్టర్ క్రాంతికుమార్ కూడా తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు.



### రియల్ ఎస్టేట్ రెగ్యులేటింగ్ అథారిటీ (రెరా)ను

## రద్దు చేయడం మంచిది-అది బిల్డర్లకు మాత్రమే సహాయపడుతుంది

(సుప్రీం కోర్టు తీర్పు)

**బద్వేలు లీగల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**

స్థిరాస్తి నియంత్రణ ప్రాధికార సంస్థ (రెరా) అనగా రియల్ ఎస్టేట్ రెగ్యులేటింగ్ అథారిటీని రద్దు చేయడం మంచిదని, అది కేవలం బిల్డర్లకు మాత్రమే సహాయపడుతుందని సుప్రీం కోర్టు ధర్మాసనం విమర్శనాత్మక అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ప్రజల కోసం ఏర్పడిన రియల్ ఎస్టేట్ రెగ్యులేటింగ్ అథారిటీ వారికి చేస్తున్న ఉపకారం ఏమీ లేదని పేర్కొంటూ రెరాను ప్రవేశపెట్టడం వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని రాష్ట్రాలు పునరాలోచించాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ "స్థిరాస్తి నియంత్రణ ప్రాధికార సంస్థ అనగా రియల్ ఎస్టేట్ రెగ్యులేటింగ్ అథారిటీ సంస్థ ఎవరి కోసం సృష్టించబడిందో ఇప్పుడు అన్ని రాష్ట్రాలు ఆలోచించాలి, డిఫాల్ట్‌గా బిల్డర్లకు సౌకర్యాలు కల్పించడమే తప్ప మరేమీ చేయడం లేదు. ఈ సంస్థను రద్దు చేయడం అత్యుత్తమం". అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. రాష్ట్ర రెరా కార్యాలయాన్ని ధర్మశాలకు మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ పై స్టే విధించాలని హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన అప్పీల్‌ను విచారిస్తూ ధర్మాసనం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది. "రెరాల పనితీరు పేల్వం, నిరాశావహం, విచారకరం, వాటిని రద్దు చేసినా మాకు అభ్యంతరం లేదు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ సంస్థలపై అన్ని రాష్ట్రాలు పునరాలోచన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొంది. రెరా ప్రధాన కార్యాలయాన్ని సిమ్లా నుండి ధర్మశాలకు తరలించేందుకు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం అనుమతివ్వగా దానిని సవాల్ చేస్తూ పలు పిటీషన్లు దాఖలు కాగా తరలింపును నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించగా ప్రజలకు ఉపయోగపడని రెరా కార్యాలయం ఎక్కడుంటే ఏమిటని ధర్మాసనం తీవ్రంగా ప్రశ్నించింది. కార్యాలయం తరలింపు నిర్ణయం పూర్తిగా పాలనాంశం అని సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయపడుతూ రెరాను రద్దు చేయడం మంచిదని, అది కేవలం బిల్డర్లకు మాత్రమే సహాయపడుతుందని ప్రజల కోసం ఏర్పడిన రెరాలు వారికి చేస్తున్నదేమీ లేదని రద్దు చేయడం మంచిదేనని తే.12.02.2026 దీన తీర్పును వెలువరించింది. (శీర్షిక: హిమాచల్ ప్రదేశ్ ఎదిరి నరేష్ శర్మ, ఎస్ఎల్‌పి (సి) నెం.005835/2026)

### ఉనికి కోసమే తమపై వైసీపీ నాయకుల

## అసత్య ఆరోపణలు

### నిబంధనల మేరకే శివాలయం భూమి లీజుకు

### మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి



**ప్రొద్దుటూరు ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

కొత్తపల్లి గ్రామపంచాయతీలో వైసీపీ నాయకుల ఉనికి కోసమే తమ కుటుంబం పై అసత్య ఆరోపణలు, చౌకబారు విమర్శలు చేయడం తగదని కొత్తపల్లె మాజీ సర్పంచ్ కొని రెడ్డి శివ చంద్రారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం స్థానిక ఎఫ్జి కళ్యాణ్ మండపం ఎదురుగా ఉన్న శివాలయం లీజు భూముల వద్ద నుండి ఆయన విలేకరులతో మాట్లాడుతూ శివాలయం భూములు అన్యాక్రాంతం చేసి అక్రమ కట్టడాలు నిర్మించేందుకు మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రయత్నిస్తున్నారన్న బంగారు రెడ్డి అసత్య ఆరోపణలను ఆయన ఖండించారు. తాను శివాలయం చైర్మన్గా ఉన్న సమయంలో శివాలయానికి మంచి చేయాలన్న ఉద్దేశంతో వీడు భూములుగా ఉన్న ఈ స్థలాన్ని ఎండోమెంట్ నిబంధనల మేరకు 2006లో జరిగిన వేలంపాటలో తమ కుటుంబ సభ్యులు లీజుకు దక్కించుకున్నారన్నారు అప్పటినుండి ఈ భూమి తన అధీనంలో ఉందని తిరిగి 2023లో జరిగిన వేలంపాటలో సుమారు 11 లక్షల 15 వేల 900 రూపాయలు డిపాజిట్ చేశామన్నారు. ఈ నగదు డిపాజిట్ చేసినట్లు ఎండోమెంట్ అధికారులు కూడా తమకు లేఖ ద్వారా తెలిపినట్లు పేర్కొన్నారు. నాటి నుండి నేటి వరకు ప్రతి సంవత్సరం లీజు చెల్లిస్తూ శివాలయం భూమిని సంరక్షిస్తున్నామని తెలిపారు. ఇది గిట్టని వైసిపి నాయకులు శివాలయం భూములు అన్యాక్రాంతం చేస్తున్నారని తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీని వెనుక నంద్యాల కొండారెడ్డి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఉన్నారన్న బంగారు రెడ్డి వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి ఆయన తనయుడు నంద్యాల కొండారెడ్డిలను విమర్శించే అర్హత వైసిపి నాయకులకు లేదన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివాలయం భూములను అన్యాక్రాంతం చేసే ప్రయత్నం చేయలేదా అని ప్రశ్నించారు. అదే భూమిలోనే ఆ ప్రాంత ప్రజలకు మంచినీటి వసతి కల్పించాలన్న సదుద్దేశంతో బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీన్ని కూడా రాద్ధాంతం చేసి ఆరోపణలు చేయడం తగదన్నారు శివాలయం భూములకు సంబంధించి ఎలాంటి అన్యాక్రాంతం చేయలేదని నిబంధనలు మేరకు 11 సంవత్సరములకు లీజు తీసుకుని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిపారు కేవలం కొత్తపల్లి పంచాయతీలో ఉనికి కోల్పోతున్నామన్న భయంతో తమ కుటుంబం పై బురదలే ప్రయత్నం తగదన్నారు. అనంతరం నిజాదారుడు 13వ వార్డు మాజీ మెంబర్ కొన్ని రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మార్చి 18వ తేదీ 2023 వ సంవత్సరం ఆర్జెసి నుండి లీజు తమకు వచ్చిందని అయితే లీజు అగ్రిమెంట్లో పొందుపరిచిన స్థలం కన్నా తక్కువ స్థలం ఇక్కడ ఉండటం చేత ఆర్ జె సి ని శివాలయం మాన్యానికి సంబంధించిన భూమి సరిహద్దులు చూపించమని త్వరగా టెండర్ ప్రత్య పూర్తయిన తర్వాత తాము సరిహద్దులు చూపిస్తామని ఆర్జెసి చెప్పినట్లు నాటి ఈవో శంకర్ బాలాజీ తెలిపారు అన్నారు. నా డిలీజు నుండి నేటి వరకు ఈ మాన్యం భూమి తమ హక్కుల ఉందని పేర్కొన్నారు పదేపదే ఈ భూమిపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని లేదంటే పరువు నష్టం దావా వేయక తప్పదని హెచ్చరించారు కొత్తపల్లె పంచాయతీలో అభివృద్ధిని తాము కాంక్షిస్తున్నామని అభివృద్ధి కోసం అహర్నిశలు తమ శ్రమిస్తున్నామని అలాంటి తమపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

## సైబర్ నేరాలపై అవగాహన




**రాజుపాళెం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ విజయ్ కుమార్ అధ్యక్షతన, భారత్ రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారు ఆర్థిక నేరాలు సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ఆర్థిక లావా దేవీలు సైబర్ నేరగాళ్ల పన్నే ఉచ్చులు, వాటి నుంచి ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలనే విషయం పైన ప్రజల అవగాహన కల్పించారు. సొసైటీ అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల ఫోన్ చేసి అడిగే లింకులు ఓపెన్ చేయమని చెప్పడం కానీ ఓటీపీలు అడగడం కానీ చేసినప్పుడు వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించుటకు కరపత్రాలను పంపిణీ చేశారు.

## పరిశుభ్రతా చర్యలు చేపట్టండి



**దువ్వూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

ప్రజల తమ ఇళ్ల చుట్టూ పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆరోగ్య పర్యవేక్షకుడు శివ గంగరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన దువ్వూరులోని కొత్త కొట్టాలు వీధిలో పరిశుభ్రత చర్యలలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే అలాగే లార్వా సర్వేను నిర్వహించారు. దోమల నివారణకు గాను ఆమ్మైట్ ద్రావకాన్ని పిచికారి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి నిల్వలు తగ్గిపోయినందు వలన నీరు త్వరగా కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు పెరిగితే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్, రవికుమార్, వసుంధర, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వార్షికోత్సవం

**పోరుమామిళ్ల రూరల్ , ఏప్రిల్ 17 ప్రభాత వార్త :**

పోరుమామిళ్ల MPPS మెయిన్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సీవీబీవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఇప్పటికే 20 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, అబ్దుల్ సత్తార్, మాధవి మాట్లాడుతూ ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని, పూర్తి స్థాయి ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో లీనివీలు వెంకటయ్య, కొండిశెట్టి, క్లస్టర్ బీలీ జేమ్స్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## వర్షిక రుణ జీవన ఉపాధుల తయారీపై శిక్ష



**కలసపాడు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:**

కలసపాడు మండల సమాఖ్యలో 2026, 27 సంవత్సరం వార్షిక రుణ జీవనోపాదుల తయారి ప్రణాళిక పై శిక్షణ శుక్రవారం జరిగింది .ఏపియం ప్రకాష్ రావు మాట్లాడుతూ 2026, 27 ఆర్థిక సంవత్సరానికి ప్రతి స్వయం సహాయక సంఘాలకు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కొరకు నిధుల లభ్యత, ప్రభుత్వ పథకాల అనుసంధానం పైన అవగాహన కల్పించారు. 2026, 27 ఆర్థిక సంవత్సరంలో సామాజిక పెట్టుబడి నిధి బ్యాంకు లింకేజీ రుణాలు నారీ శక్తి రుణాలు ఉన్నతి నిధులు పీఎంఈజీపి పిఎం ఎఫ్ఎం పీఎం సూర్యగర్ పీఎం విశ్వకర్మ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ కార్పొరేషన్ సనిధులను అనుసంధానం, ఉపాధి హామీ, పశు సంవర్ధక శాఖ, అగ్రికల్చర్, హార్టికల్చర్,పలు రకాల ప్రభుత్వ శాఖల కన్వెర్జెన్సీ ద్వారా నిధులు సమకూర్చడం జరుగుతుందని వివరించారు. డ్వాక్రా మహిళా సంఘ సభ్యుల కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యం గా మెరుగైన జీవనోపాదులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో మహిళా సంఘం సభ్యులకు ఆదాయ అభివృద్ధి కి ఆస్తుల కొనుగోలు తో పాటు సామాజిక భద్రత లో భాగంగా ఇన్సూరెన్స్ కార్యక్రమాలు అమలు చేయడంలో గ్రామ సంఘాల ఉపకమిటి లు కీలకమైన పాత్ర ఉంటుందని పాడి పశువులు గొర్రెలు మేకలు పెంపకము కోళ్ల పెంపకము ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు టైలరింగ్ లో శిక్షణ బ్యూటీ పార్లర్ నిర్వహణ వ్యవసాయ అనుబంధ వ్యాపారాల నిర్వహణ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు హోటల్లు టీ సెంటర్లు టిఫిన్ సెంటర్స్ సప్లయర్స్ చిరు వ్యాపారాలు, కిచెన్ గార్డెన్ పెరటి కోళ్ళు, ప్రకృతి వ్యవసాయం విధానాలు, మిల్లెట్స్ బేస్డ్ యూనిట్స్ ఏర్పాటు, కూరగాయలు సాగు అమ్మకం, చికెన్ సెంటర్ ల ఏర్పాటు సర్కులర్ ఎకానమీ యూనిట్స్ ప్రోత్సహించేందుకు సభ్యుల అవసరాన్ని బట్టి ప్రణాళిక ప్రకారం నిధులను అందజేయనున్నట్లు ఏపీఎం వివరించారు. డ్వాక్రా సంఘాలలో సభ్యుల మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలనీ కమ్యూనిటీ కో ఆర్డినేటర్లను కోరారు. వార్షిక రుణ మరియు జీవనోపాదుల సర్వే కార్యక్రమం ఏప్రిల్ 15 తేదీ నుండి 30 తేదీ వరకు ఈ నారీ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ లు , గ్రామ సమాఖ్య అసిస్టెంట్ లు సంఘం వారీగా నిర్వహిస్తారని డ్వాక్రా సంఘాలు సహకరించాలని కోరారు. అనంతరం కమ్యూనిటీ కోఆర్డినేటర్లు క్లస్టర్ వారిగా వార్షిక రుణ మరియు జీవనోపాదుల ప్రణాళికను సభ్యులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపియం ప్రకాష్ రావు, సిసి లు, అకౌంటెంట్ పాల్గొన్నారు.

### మహిళా సాధికారతకు చారిత్రాత్మక అడుగు -

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు జనసేన మద్దతు

### పార్లమెంట్‌లో బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపిన ఎంపీ

**వేంపల్లె: ఏప్రిల్ 17 ప్రభాతవార్త**



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం)ను మహిళా సాధికారతకు చారిత్రాత్మక అడుగుగా పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ తెలిపారు. మహిళలకు రాజకీయ రంగంలో మరింత ప్రాతినిధ్యం కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను ఆయన స్వాగతించారు. శుక్రవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో జనసేన పార్టీ తరపున కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపారని అన్నారు. మహిళా శక్తిని బలోపేతం చేయడంలో ఈ బిల్లు కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. జనసేన పార్టీ మహిళా సాధికారతకు పూర్తిగా కట్టుబడి ఉందని దాసరి రవిశంకర్ స్పష్టం చేశారు. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో మహిళల అభివృద్ధి, సమాన అవకాశాలు మరియు రాజకీయ ప్రాతినిధ్యం పెంపొందించేందుకు జనసేన పార్టీ నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు.